

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 13 జూన్, 2016 సంచిక : 1

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**
**సాయివాణి**
C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
**Ph : 9440413455, 9848133565**
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
జగద్గురు తత్త్వబోధకస్వామి .......... 5
మంగళాశీస్సులు .......... 8
శ్రీ గజానన విజయం .......... 9
షిరిడీ డైరీ .......... 13
రాణిమాత భిక్షము .......... 17
శుకవాణి .......... 19
గురువాణి-5 .......... 21
సాకోరీ మహర్షి .......... 23
జీవుడు - కర్తవ్యం .......... 26
వినండి - నా మాట .......... 28
గురువుగారితో కబుర్లు .......... 29
మాతృసంస్థ కబుర్లు .......... 31







# మా వాణి

## మహనీయులు - మనం

శ్రీ సాయినాథుల వారు చాలా చిన్న చిన్న చర్యల ద్వారా, మాటల ద్వారానే చక్కని ఉపదేశాలు అందించేవారు. అవి అందరికీ అర్థమయ్యేవి కావు. కానీ, కాలక్రమంలో వాటి భావం అనేకమందికి అవగతమయ్యేది. సాయి మసీదులోని కట్టడాకు ఆనుకొని కాళ్లు చాపుకొని కూర్చొని ఉండేవారు. అప్పుడాయన కాళ్లు భక్తులు నొక్కుతూ ఉండేవారు. మావిశీ బాయి, అన్నాచించిణీకర్, నానాసాహెబ్, తాత్యా, ఆత్మారామ్ భార్య మొదలైన వారెందరి పేర్లో యీ సందర్భంగా వస్తాయి. తన భక్తుల ఆధివ్యాధులన్నీ పోగొట్టగల సాయిబాబాకు మరొకరు సేవ చేయవలసిన అవసరం ఎందుకేర్పడింది? సర్వశివంకరుడైన పరమశివుడు భిక్షమెత్తవలసిన అవసరం ఏమిటి? ఒక్క ఆశీస్సుతో ఎదుటివారికి కరువు పోగొట్టగల సాయి చెయ్యి చాపి దక్షిణ అడగటం ఏమిటి? భుజం మీది కేన్సర్ వ్రణం లాంటిదాన్ని చిరునవ్వుతో సహించగలిగిన రమణమహర్షికి కాళ్లనొప్పలేమిటి? వీటన్నిటి వెనుక ఉన్న పరమార్థం ఏమిటి?

మనం నిత్యజీవనంలో ఎన్నెన్నో దోషాలు చేస్తూ ఉంటాం. పంచసూనాలంటారు వాటిని. ఈ దోషాలు తప్పనిసరివి. ఇవికాక జంతుహింస, మోసం, అధర్మం, లంచగొండితనం తెలిసి చేసే పాపాలెన్నెన్నో? అవి తీరడానికి ఏదో ఒక మార్గం ఉండాలి గదా? అందులో ఒకటి గురు జనసేవ. గురువు అంటే అజ్ఞానాంధకారాన్ని తొలగించేవాడు. అందుచేత గురువును సేవించటం ఒక ధర్మం. పైగా ప్రయోజనకారి కూడా. శ్రీ సాయినాథులవారు ఎన్నో సందర్భాలలో చిన్నిచిన్ని సంఘటనల ద్వారా గొప్ప ఉపదేశాలిచ్చేవారు.

ఉదాహరణకు మావిశీబాయి విషయం తీసకుందాం. ఆమె బాబాగారి నడుము, పొత్తికడుపు ప్రక్కభాగం తోముతూ ఉండేది. ఒకరోజు ఆమె చాలా బలంగా తోముతుండటం చూచి ప్రక్కనున్న భక్తులు భయపడి 'అమ్మా, కాస్త మెల్లగా రుద్దు. బాబా కడుపులోని నరాలు, పేగులు తెగిపోతాయేమో!' అన్నారు. బాబాకు కోపం వచ్చింది. తన చేతిలోని సటకా కొసను పొత్తికడుపులోని చలా గట్టిగా పొడుచుకున్నారు. దాదాపు మొత్తం సటకా లోపలికి వెళ్లిపోతుందేమోనన్నంత బలంగా పొడుచుకున్నారు. కొద్దిసేపటి తరువాత కోపం తగ్గి శాంతించారు - అప్పడర్థమైంది భక్తులకు-యీ సేవ భక్తురాలికి ఆనందాన్నీ, ప్రయోజనాన్నీ కలిగించడానికేగానీ బాబా కోసం కాదని.

భాగోజీ కుష్ఠ రోగి. అతని ఆ వ్యాధిని బాబా సమూలంగా తొలగించి వేసారు. అతడు బాబాతోనే జీవించసాగాడు. ఒక కమ్మరి పసిబిడ్డ నిప్పుల్లో పడినప్పడు - అతన్ని నిప్పులోంచీ తీయడం కోసం తమ చెయ్యి కాల్చుకొన్నారు బాబా. భాగోజీ ఆ కాలిన గాయానికి నెయ్యి రాసి కట్టు కట్టేవాడు. ఎన్నాళ్ళు? నాళ్లు కాదు - ఏళ్లు. అంతకాలం ఆ గాయం ఉన్నదా? కుష్ఠ రోగం నయం చేసిన బాబా తన చేతిపుండు మాన్పకోలేరా? భాగోజీ సేవ అవసరమా? అవసరమే - కానీ ఎవరికి? భాగోజీకి. అతనికి అనేక దోషాలుండటం చేతనే (ప్రారబ్ధం వలన) ఆ రోగం వచ్చింది. అది బాబా అనుగ్రహం వలన తీరింది. అతనికి ఆ ఋణం తీరాలి. ప్రారబ్ధ శేషం నశించాలి. అందుకు ఆ సేవ అవసరమైంది.

రమణ మహర్షి చెంతకు "కీరపాటి" అనే ఒక వృద్ధురాలు ప్రతిరోజు ఆకుకూరలు వండి తెచ్చి పెడ్తుండేది. కొండంతా తిరిగి ఎక్కడెక్కడి ఆకులో తీసుకొచ్చి వండి ఆ తండ్రికి సమర్పించడం ద్వారా ఆమె ఎన్ని ప్రారబ్ధాలు పోగొట్టుకున్నదో! మహనీయులు తమ కోసం సేవలు అందుకోవడం మనకు బాహ్యదృష్టికి మన సేవలాగ కన్పిస్తుంది. కానీ నిజానికి వారు





మనకు చేయదలచిన ఏ మహోపకారానికో ముందుగా దీనిని స్వీకరిస్తున్నారన్న మాట. బాబా అడిగినప్పడు దక్షిణలు సమర్పించుకున్న వారందరికీ మహత్తరమైన సత్ఫలితాలు లభించాయని మనం చదువుకున్నాం. రమణ మహర్షుల వారు పెరుమాళ్లు అనే భక్తుని సేవ స్వీకరించారు. అనారోగ్యంతో ఉన్న రమణులు వాంతి చేసుకుంటే పెరుమాళ్లు తన చేతులతో పట్టి పారబోసి శుభ్రం చేసేవారు. అలాంటివారు కాలగతిలో క్రోధానికీ, అహంకారానికీ లోనై భగవాన్ని ఎంతో అవమానించారు. పైగా ఆయన గూర్చి అవాకులూ, చవాకులూ పేలడమేగాక ఆ మేరకు ఒక గ్రంథం కూడా వ్రాసారు. అంతా చేసి ఆశ్రమం విడిచిపోయి కొంతకాలానికి మళ్లీ వచ్చి కాళ్ల మీద పడి, క్షమాపణ అడిగి "నువ్వే నాకు దిక్కు" అన్నాడు. రమణులు కరుణతో కరిగి "అయితే సరే, నేనే దిక్కులే" అన్నారు. అటుపైన రమణులకు చేతి మీద పెద్ద వ్రణం లేచింది. అది తగ్గదని ముందే చెప్పారు రమణులు. ఒక భక్తుడు కన్నీళ్లు పెట్టుకొని,

"ఇదేం అన్యాయం స్వామీ, మీలాంటి మహనీయుడికిది ఎందుకు రావాలి?" అని దీనంగా అడిగాడు. అందుకు రమణులు చిరునవ్వుతో "అదొక రహస్యం. పెరుమాళ్లు అంత పాపం చేశాడు. దాని ఫలితాన్ని వాడొక్కడే అనుభవించగలడా? వాడి సేవ గ్రహించిన వాడిని వాడి పాపం మాత్రం పంచుకోవద్దూ?" అన్నారు. అంతటిది మహనీయుల సేవా ఫలితం! రోజూ తనకు భోజనం పెట్టిన బాయిజాబాయి కొడుక్కు ముంచుకు వచ్చిన మృత్యువును తన మీదకు లాక్కుని అతన్ని రక్షించారు సాయి. గొలగమూడి వెంకయ్య స్వామి వారు తనను నిత్యం సేవించిన వారిని ఎన్నెన్నో ఉత్తమ స్థితులకు నడిపించారు-నా గురుదేవులు "స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు". అందుచేత గురుజన సేవావకాశాన్ని క్షణమైనా విడువకండి.

# జగద్గురు తత్త్వబోధక స్వామి

**- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర**

**- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి**

(గత సంచిక తరువాయి)

ఈ ఐరోపా దేశపు స్వాముల వారి వల్ల కొన్ని సంగతులు వినాలని మధుర రాజైన ముద్దు వీరప్పనాయకునికి కూడా కుతూహలం కలిగి తన దర్బారులో చాలాసార్లు అన్నాడట. అంతట నోబిలీని బాగా ఎరిగిన వారొకరు ఈ సన్యాసి తనకు స్త్రీల ముఖం కనబడుతుందేమోనని తన యిల్లు వదలి బయటకేరాడని అన్నారట! ఒక్కమాటైనా వీథిలో నడవకుండా ఇలాగ ఒక సంవత్సరంపాటు నోబిలీ కాలక్షేపం చేసేటప్పటికి ఆయనను గురించి ప్రజలకు గౌరవం కలిగింది. తరువాత ఎప్పడైనా ఒక మాటు ఊరిబయట దూరంగా ఉన్న తన పెద్దయింటికి ఒక పల్లకీలో నెక్కిపోయేవాడు. తరువాత ఆయన పల్లకీ ముందు ప్రజలు భేషజమంతా కట్టిపెట్టి సామాన్య స్వాములవారిలాగానే ఒక కాషాయంబరం ధరించి ఒక పెద్ద పొడుగుపాటి దండము చేతపుచ్చుకొని ఇద్దరు బ్రాహ్మణ శిష్యులు వెంటరాగా కాలినడకనే బయలుదేరాడు.

మొట్టమొదట ఇలాంటి భేషజము చూపించాలని నోబిలీ అనుకోలేదటగాని మాట సందర్భంలో ఒక శైవ 'పండారము' ఆయనకు ఇలా సలహా ఇచ్చాడట. "కేవలము మీ మట్టుకు మీరు తరించాలంటే మీరే మారుమూల ప్రదేశానికో పోయి దిగంబరిగా వుండవచ్చును. కాని ఇతరులను తరింపజెయ్యాలని మీ ఉద్దేశమని మీరంటున్నారు. కనుక మీరు పటాటోపం కనబరచి తీరాలి. నిజమైన విరాగి పట్టుపీతాంబరాలనూ, గుడ్డపేలికలనూ, భాగ్యభోగ్యాలనూ, దారిద్ర్యమునూ, మానావమానాలనూ ఒక శవము వహించేటట్లుగా నిర్లిప్తతతో భరించాలి" అని అన్నాడట.





ఆ పండారము ఈ సలహానిచ్చినది 1608వ సంవత్సరము మధ్యలో నట. అంతకుపూర్వము నోబిలీ యింకా పోర్చుగీసు మతాచార్యుల నల్ల దుస్తులనే ధరించేవాడట. 'బడగ'లనే తెలుగు వారికిది చాలా అసహ్యకరంగా ఉన్నదనిన్నీ, దీనిని తీసివేసి ఈ దేశంలో మతగురువులు, స్వాములు ధరించే దుస్తులనే మీరు కూడా ధరించవలసినదనిన్నీ ఆ తమిళ శైవుడు ఆయనకు గట్టిగా చెప్పాడట. మీరు మాత్రం తరించాలంటే మీ ఇష్టం వచ్చిన దుస్తులు వేసుకొనవచ్చును. కాని మీరు ఇతరులకు ముక్తిమార్గాన్ని బోధించదలచుకుని శిష్యులను ఆకర్షించదలచుకుంటే మీరు సాధ్యమైనంతవరకూ ఈ దేశాచారాలను అవలంబించాలని కూడా అతడు అన్నాడట. అంతట నోబిలీ ఒక స్వాములవారిలాగ తయారైనాడు.

లెయిర్జియోగారి వుత్తరంలో నోబిలీ దుస్తుల వర్ణన కనబడుతూ వుంది. ఈయన ఒక పొడుగైన కాషాయపుటంగీని ధరించి ఒక కాషాయపు ఉత్తరీయాన్ని కప్పకునేవాడు. ఆ రంగుగుడ్డతోనే తలకొక తలపాగాను చుట్టుకునేవాడు. కాళ్ళకు పాంకోళ్లు తొడుగుకునేవాడు. ఇంతేకాదు, ఈ దేశంలో బ్రాహ్మణులూ, క్షత్రియులూ ఉపనయనంలో ధరించే ఉత్తర జందెముల వంటివి మూడు బంగారు పోగులూ, రెండు వెండి పోగులూ గల ఉత్తర జందెములను వేసుకొని వాటిమధ్య మెడలో ఒక శిలువను కూడా ధరించేవాడు. దీనికి క్రైస్తవ మతానికి సంబంధించిన ఒక అంతరార్థం వున్నదని అనేవాడు. కొన్నాళ్ళయిన తరువాత జగద్గురువు ఇలాంటి జందెము వేసుకోనక్కరలేదని నోబిలీ దానిని విసర్జించాడు.

## విచిత్ర వేదాంతము

నోబిలీ చేసే మతబోధ, ప్రచారములు చాలా చిత్రంగా ఉండేవి. హిందువుల మతగ్రంథాలలోని కథలలోను, సిద్ధాంతాలలోను తన కుపయోగించే సంగతులు తీసికొని వాటినిబట్టి మతబోధ చేసేవాడు. ఈ హిందూ దేశీయులకు నాలుగు వేదములున్నవనిన్నీ, అందులో ఒకటి

పోయినదనిన్నీ నోబిలీ విన్నాడు. ఇప్పుడున్న వేదాలలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను గూర్చి చెప్పబడినదనిన్నీ, నాల్గవదానిలో కేవలమూ మోక్ష మార్గమే వివరింపబడినదనిన్నీ, కేవలము యిప్పుడున్న వేదాలవల్ల తరించలేరనిన్నీ, ఆ నాలుగవ వేదమును ఉద్ధరించగల బుద్ధిమంతు డెవ్వడూ లేడని కొందరు అనుకుంటున్నారనిన్నీ విన్నాడు. ఈ ప్రజలు మోక్ష మార్గమును వాంఛిస్తారు. అపచారాలకు ప్రాయశ్చిత్తాలను చేసుకుంటారు. దానధర్మాలు చేస్తారు. తమ విగ్రహాలకు అతిభక్తి విశ్వాసాలతో మ్రొక్కుతారు. అందువల్ల వీరి నమ్మకాలను పురస్కరించుకొని నోబిలీ పనిచేయదల చాడు. తాను మోక్షమార్గమును బోధించడానికి వచ్చాననిన్నీ, తమ బ్రాహ్మణులు పోయినదని చెప్పే నాల్గవ వేదంలోని మతధర్మాలను గురించి వారికి బోధించడానికే తాను దేశంగాని దేశాన్నుంచి యింతదూరం వచ్చాననిన్నీ చెపుతూ నోబిలీ ప్రజలకు బోధించడం ప్రారంభించాడు.

ఈ క్రొత్త పద్ధతి మత ప్రచారము అని చమత్కారంగా వున్నదనిన్నీ, తాను క్రైస్తవులుగా చేయదలచిన యీ హిందువుల మతవిశ్వాసాలలోనూ, సిద్ధాంతాలలోనూ గల గట్టి ఘట్టాలనూ, లోపాలనూ కూడా ఈ నోబిలీ ఎంత బాగా గ్రహించాడో దీనివల్ల బాగా తెలుస్తూ ఉన్నదనీ మాక్సు ముల్లర్‌గారు వ్రాశారు.

'ఎక్సోడస్' అనే పుస్తకంలో తన ప్రచార పద్ధతిని గురించి నోబిలీగారే యిట్లు వ్రాశారు. "హిందువుల దేవుళ్ళు పనికిమాలినవారైనా వారిని దూషించకూడదు. ఆ దేవుళ్ళను దూషిస్తే దానివల్ల మనకు లాభం కలిగేటందుకు బదులు నష్టం కలుగుతుంది. ఒక గదిలోనుంచి చీకటిని తొలగించాలంటే చీపుళ్ళు పుచ్చుకొని దులిపి కాలం వ్యర్థపరుస్తామా? ఒక దీపం వెలిగిస్తాము. చీకటి దానంతట అదే మాయమౌతుంది. స్నేహం చేత క్రైస్తవేతరుడి హృదయాన్ని ఆకర్షించాలి. అతనికి మనయందు భక్తి విశ్వాసాలు కలుగచెయ్యాలి. తరువాత అతనికి సత్యమనే దువ్వెన ఇవ్వాలి. అంతట విగ్రహారాధనమనే అంధకారము, చిక్కులు లేకుండా మాయమౌతుంది".

**(సశేషం)**







# మంగళాశీస్సులు



చి॥సౌ॥ గాజుల సంధ్య శ్రీ సాయి విద్యాధామం పూర్వ విద్యార్థిని - విద్యాధికురాలైంది. ఆమె తల్లిదండ్రులు శ్రీమతి శారద, శ్రీ యాదగిరి గౌడ్‌లు చి॥ సంధ్య, చి॥ రాజుగౌడ్‌తో 20, ఏప్రిల్ 2016 మధ్యాహ్నం అభిజిల్లగ్నంలో శాస్త్రోక్తంగా కళ్యాణక్రతువు నిర్వహించారు. నవ వధూవరులకు అన్యోన్యప్రేమ భావన, సత్సంతానం, చక్కని సామాజిక స్నేహాలను పరమపూజ్య గురుదేవుల ఆశీస్సు, శ్రీ సాయి నాథుల వారి దివ్యాశీస్సు ప్రసాదించుగాక!- అని సాయివాణి కోరుతున్నది.

బహుకాలంగా రామలింగంపల్లె పోస్ట్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు శ్రీ బొమ్మ అంజయ్య. ఆయన తన సతీమణి శ్రీమతి లక్ష్మితో కలిసి తమ ఏకైక పుత్రుడు చి॥ నవీన్‌కుమార్ వివాహం చి॥సౌ॥ లాస్యప్రియతో 22, ఏప్రిల్ 2016 ఉదయం 10 గం. 59 ని.లకు విధివిధానం ప్రకారం నిర్వహిం చారు. చక్కని సంస్కారం, చదువు గల చి॥ నవీన్‌కుమార్ ఆదర్శ దాంపత్యం నెరపి, లోకశ్రేయస్సుకై పనికిరాగల రీతిలో తమ సత్సంతతిని పెంచి ధన్యులు కావలసిందిగా శ్రీ గురుదేవులు, శ్రీ సాయిదేవులు దివ్యాశీస్సులను అందింతురు గాక! - అని సాయివాణి ఆకాంక్షిస్తున్నది.

చి॥ ప్రవీణ్ సాయి విద్యాధామం పూర్వవిద్యార్థి, మంచి సంస్కారాలు, ఆశ్రమం పట్ల, గురుదేవుల పట్ల మంచి అభిమానం కలవాడు, సేవాసక్తి ఉన్నవాడు. అతని తల్లిదండ్రులు శ్రీమతి నీల విజయలక్ష్మి శ్రీ రాందాస్ ముదిరాజ్‌లు చి॥ ప్రవీణ్ కళ్యాణం చి॥సౌ॥ రజితతో 29, ఏప్రిల్, 2016 ఉదయం గం.11-15 ని.లకు సాయిధామం ఆశ్రమంలోని శ్రీ సాయికళ్యాణి ఆడిటోరియమ్‌లో శాస్త్రోక్తవిధిన నిర్వహించారు. వధూవరులు పరస్పరా నురాగంతో, మంచి అవగాహనతో కలకాలం జీవించి, సత్సంతని పొంది, వారిని లోకకళ్యాణకారకులుగా తీర్చిదిద్దాలని పరపూజ్య గురుదేవులు, శ్రీ సాయినాథులవారు మంగళాశీరక్షతలు చల్లాలని సాయివాణి ప్రార్థిస్తున్నది.



# శ్రీ గజానన విజయం

- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

ఒకసారి అమావాస్య సోమవారంనాడు వచ్చింది. ఆ తిథిని సోమావతీ పర్వదినం అంటారు. ఆరోజు నర్మదానదిలో స్నానం చేసి రావాలని, ఓంకారేశ్వర్ వెళ్లాలనీ షేగాంవ్‌లోని భక్తులు-మార్తాండ్ పాటిల్, బంకట్‌లాల్ మారుతీ చంద్రభాను, భజరంగ్‌లాల్ అంతా నిర్ణయించుకొన్నారు. ఓంకారేశ్వర్‌కు తమతోపాటు గజాననులను కూడా తీసుకువెళ్లాలని వాళ్ల కోరిక. "మహరాజ్! మీరు మాకు తల్లి. ఇలాటి యాత్రలకు తల్లి వెంట రాకపోతే ఎలాగ? మీరు కూడా మాతోపాటు ఓంకారేశ్వర్‌కు రావలసిందే" అని ప్రార్థించారు. అయితే వారు -

"అవును. సోమావతీ పర్వదినాన ఓంకారేశ్వర దర్శనం చాలా మంచిదే. విశ్వవిఖ్యాతుడైన మాంధా మహారాజు ఏలినచోటు. స్వయంగా ఆదిశంకరాచార్యులంతటివారు తమ గురువు గోవిందపాదులచేత ప్రపం చానికి ఆధ్యాత్మిక దీప్తినిమ్మని ఆజ్ఞాపింపబడినచోటు- మీరు వెళ్లి రండి. నేను మాత్రం యిక్కడే నర్మదా స్నానం చేస్తాను" అన్నారు. 'త్వరగా తిరిగి వస్తాం' అని శిష్యులంతా నమస్కరించి వెళ్లిపోబోయారు. అంతలో స్వామి

"మీరంతా ఆడంబరం మనుషులురా! నర్మదలో ఉన్న నీరే యిక్కడ మఠంలోని బావిలో కూడా ఉంది. మనం అక్కడికి వెడితే నర్మద చిన్నబుచ్చుకొంటుంది. మీకు ప్రయోజనకరమైన విషయం చెప్తున్నా-వినండి" అన్నారు. కానీ మారుతి, చంద్రభాను స్వామి రానిదే తాము కూడా వెళ్లమన్నారు.

"ఏదైనా జరగరానిది జరిగితే మాత్రం నన్ను తప్ప పట్టకండి" అంటూ స్వామి వారితో బయలుదేరారు. ఆ రోజు పర్వదినం గనుక నర్మద స్నాన





ఘట్టాలన్నీ కిక్కిరిసి ఉన్నాయి భక్తులతో. స్తోత్రాలు చదివేవారు, స్నానాలు చేసేవారు, పూలూ పళ్లతో గుడికి వెళ్లేవారు, భజనలు చేసేవారు, దేవాలయంలో అభిషేకం చూడాలని ఎగబడేవారు-మొత్తం తొడతొక్కిడిగా ఉంది. మహరాజు నదీతీరంలో పద్మాసనంలో కూర్చున్నారు. భక్తులు గుడికి వెళ్లి దర్శనం చేసుకొని వచ్చారు. తిరిగి ప్రయాణానికి సిద్ధమయ్యారు. వీధులన్నీ జనసాగరంతో పోటెత్తుతున్నాయి. బండికి కట్టిన గిత్తలు కొంచెం పొగరుబోతువి. ప్రక్కకు లాగేసే ప్రమాదం ఉంది. బండివాడు ఆ రహస్యం వీళ్లకి చెప్పకుండా ఎక్కించుకొని స్టేషన్ వైపు దారితీసాడు. వాళ్లు రోడ్డు దారిన వెళ్లటం శ్రేయస్కరం కాదనుకొని, 'పడవలో వెడదామా?' అని మహరాజును అడిగారు. 'మీ యిష్టం' అన్నారు వారు. అందరూ పడవ ఎక్కారు. ఖేడీఘాట్‌వైపు ప్రయాణిస్తుందిగా పడవ ఒక బండరాతిని ఢీకొట్టింది. దానితో పడవ పగిలి లోపలికి నీళ్లు రాసాగాయి. పడవవాడు నదిలోకి దూకేసాడు. గజాననులు తమ మామూలు అలవాటు ప్రకారం "గణ గణ గణాత్ బోలే" అంటున్నారు.

మార్తాండూ వాళ్లు చాలా భయపడ్డారు. గుండెలు దడదడలాడు తున్నాయి. "స్వామీ, మీమాట వినకుండా మిమ్మల్ని తీసుకువచ్చాము. అందుకే నర్మద మమ్మల్ని ముంచెయ్యబోతున్నది. ఈ ఒక్కసారికీ మమ్మల్ని రక్షించండి. ఇంకెప్పుడూ మీరు చెప్పిన దాన్ని కాదనం" అని ప్రార్థించ సాగారు. అప్పటికే పడవ సగానికి నీళ్లతో నిండిపోయి ఒక ఫర్లాంగు దూరం పోయింది. అక్కడ లోతు ఎక్కువ, నీటి వడి కూడా ఎక్కువే. సరిగ్గా అప్పుడే అన్నారు గజాననులు-"భయపడకండి. నర్మదామాత మీమీద కోపించదు. మీరు ఆమె ఒడిలో ఉన్నారు". అలా అంటూనే ఒక స్తోత్రం చదవసాగారు. నలుగురు భక్తులూ చేతులు జోడించుకొని కూర్చున్నారు.

"నర్మదే మంగళే దేవీ, రేవే అశుభనాశినీ,

మాంతు క్షమా కరీయాంచా, దయాళు హెూవోనీమ"ని

(నర్మదా మంగళరూపిణీ, రేవా పాపనాశినీ

వారి దోషాలను మన్నించి దయజూడు తల్లీ!)

వారి స్తోత్రం చేస్తుండగానే పడవలోని నీళ్లన్నీ బయటికిపోయాయి. కన్నం దానంతట అదే మూసుకుపోయింది. పడవ మామూలు స్థాయికి వచ్చింది. నర్మదాదేవి బెస్త వనితవేషంలో, వంకీలు తిరిగిన జుట్టుతో వారికి దర్శనమిచ్చింది. పడవ తీరానికి చేరాక దాని అడుగున ఉన్న పెద్దకన్నం చూచి అందరూ చకితులయ్యారు. భక్తులంతా వచ్చిన బెస్త స్త్రీకి నమస్కరించి, ఒక పాడి చీర యివ్వబోయారు. ఆమె తీసుకోకుండా "నేను ఓంకారం అనే పేరున్న బెస్త ఆయన కూతురును. తడిబట్టల్లో ఉండటం మాకు అలవాటే. నేనెప్పుడూ నీళ్లలోనే ఉంటాను. నీళ్లు నా మరో రూపం" అంటూ అంతర్ధానమైపోయింది. నర్మదానదే స్వయంగా గజాననుల దర్శనార్థం వచ్చిందని భక్తులకు అర్థమై చాలా ఆనందించారు.

బంకట్‌లాల్ "ఆమె ఎవరు? ఆమె గురించి చెప్పండి" అని గజాననులను అడిగాడు. "ఆమె చెప్పింది మీరు వినలేదూ? ఓంకార్ తన తండ్రి అని చెప్పిందిగా! ఆయన ఓంకారేశ్వరుడే. తన మరో రూపం నీరని చెప్పింది గదా! ఇంకా అనుమానం దేనికి? ఆపదలో ఉన్న వారినెప్పుడూ సహాయపడే తల్లి ఆమె" అన్నారు స్వామి. నర్మదకు జయజయధ్వానాలు చేసారు అందరూ. షేగాఁవ్ తిరిగి వచ్చాక యీ విషయం అక్కడి వారందరికీ చెప్పి సంతోషపడ్డారు.

ఒకసారి సదాశివ రంగనాథ వన్‌వాలే అన్న భక్తుడు మరో వ్యక్తితో కలిసి గజాననుల దర్శనానికి వచ్చాడు. ఇతడు మాళవదేశంలో బాగా ప్రసిద్ధుడైన మాధవనాథుని శిష్యుడు. మహరాజు అతన్ని చూస్తూనే మాధవనాథుని గుర్తు చేసుకున్నారు. సదాశివను తన దగ్గరకు పిలిపించారు. కొద్దిగా ముందు వచ్చి ఉంటే వాళ్ల గురువు దర్శనమయ్యేదనీ, ఒక్క క్షణం క్రితమే ఆయన వెళ్లిపోయారనీ చెప్పారు. వాళ్లను గురు





(మాధవనాథుని) దర్శనానికి వెళ్లమని చెప్తూ, వాళ్లకు కొన్ని తమలపాకులు, వక్కలు ఇచ్చి, అవి గురువుకిమ్మనీ, "మనం కలిసి భోంచేసాము. మీరు తాంబూలం వేసుకోకుండా వెళ్లిపోయారు. ఇవి మీకోసమే తెచ్చాను-తీసుకోండి" అని తన మాటగా మాధవనాథునికి చెప్పవలసిందనీ ఆజ్ఞాపించారు.

వన్‌వాలే ఆ తమలపాకులు తీసుకొని తన గురువు దగ్గరకు వెళ్లి అవి ఆయనకు సమర్పించి, "మీరు గజాననుల దగ్గరకు షేగాఁవ్ వెళ్లారా?" అని అడిగాడు. ఆయన "అవును, వారు మీకు చెప్పింది నిజమే. ఆయన నన్ను తలుచుకొన్నారు. అంచేత వెళ్లాను. మేము అప్పుడప్పుడూ అలా కలుస్తూనే ఉంటాం. మా శరీరాలు వేరైనా చైతన్యం ఒక్కటే. అది ఇది మీకు యిప్పుడే అర్థం కాదుగానీ వేచి చూడండి. ఈ ఆకులు తెచ్చి మంచి పని చేసారు" అన్నారు. ఆ ఆకు, వక్కలు దంచి కొంచెం తాము తిని మిగిలినవి వనవాలేకిచ్చారు.

జ్ఞానేశ్వర మహరాజు యోగులు కలుసుకొనే విధానాలను గురించి వివరంగా చెప్పారు. చాంగ్‌దేవుని గురించి చదివితే నీ సందేహాలన్నీ సమసిపోతాయి. యోగులు ఎంతో దూరం నుంచీ కూడా ఒకరినొకరు చూడగలరు, మాట్లాడుకోగలరు, కలుసుకోగలరు. తుకారాం దేహులో ఉన్నారు. షేక్ మహమ్మద్ శ్రీగొండేలో ఉన్నారు. దేహులో పందిరి కాలిపోయినపుడు షేక్ మహమ్మద్ శ్రీ గొండే నుంచే మంటలు ఆర్పారు. ఈ సంఘటన భక్త విజయంలో మహీపతి వ్రాసారు.

పాటిల్ కొడుకు బావిలో పడ్డాడు-హోలీలో. మాణిక్య ప్రభువు అదృశ్య రూపంలో హోలీకి వెళ్లి మునిగిపోయే పిల్లవాడిని రక్షించారు. ఒక అచ్చమైన యోగి మాత్రమే యిలా చేయగలరు. దంభాచారులు మాట్లాడటమే తప్ప యిలా చేయలేరు. యోగా అనేది జాతిని ఉద్ధరించగల సర్వశ్రేష్ఠమైన విజ్ఞానం.

**(14వ అధ్యాయం సంపూర్ణం)**

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

## లోకమాన్య తిలక్ షిరిడీ సందర్శనం

19-05-1917

నేను ఉదయాన్నే లేచినాగానీ, చాలామంది జనం చేరటంతో నా ప్రార్థన సాగలేదు. మమ్మల్నందరినీ మధ్యాహ్నం దాకా యిక్కడే ఉంచాలనీ, ఎక్కడికీ వెళ్లనివ్వగూడదనీ ఓ ఉద్యమం సాగుతోంది. కేల్కర్ ఆ అభిప్రాయానికి బలం యివ్వదలిచాడు గానీ నాకు అంతులేనంత కోపం వచ్చింది. ఖచ్చితంగా బయలుదేరాలనుకున్నాను. అంచేత సంగమనేరుకు చెందిన సుప్రసిద్ధ లాయరు శ్రీ సంత్ గారింట్లో ఆకు, వక్కా తీసుకొని ఉదయం ఎనిమిదిన్నర ప్రాంతాలలో బయలుదేరాం. దారిలో బండికి పంక్చరైంది. షిర్డీ చేరేటప్పటికి 10 గంటలైంది. దీక్షిత్‌వాడాలో దిగాము. బాపూసాహెబ్ బూటీ, నారాయణరావు పండిట్, బూటీగారి పనివారూ అందరూ అక్కడే ఉన్నారు. నా పాతమిత్రులు మాధవరావు దేశ్‌పాండే, బాలాసాహెబ్ భాటే, బాపూ సాహెబ్ జోగ్ వగైరాలందరూ గుమిగూడారు. మేము మసీదుకు వెళ్లి సాయి మహరాజుకు మా నమస్కారాలు చెప్పాము. సాయిబాబా అంత ఆనందంగా ఉండటం నేనెన్నడూ చూడలేదు. ఆయన దక్షిణ అడిగారు. యథాప్రకారం మేమంతా చెల్లించాం. లోకమాన్యుని వైపు చూస్తూ సాయి "మనుష్యులు చెడ్డవారు. నీకు నీవు జాగ్రత్తగా ఉండు'' అన్నారు. నేను నమస్కరించాను. ఆయన నా దగ్గర కొన్ని రూపాయలు తీసుకున్నారు. కేల్కర్, పారేగావ్‌కర్ కూడా దక్షిణలిచ్చారు. మాధవరావు దేశ్‌పాండే





మా కోసం యావలా వెళ్లడానికి అనుమతి అడిగారు. సాయిసాహెబ్ "ఈ వేడిలో దారిలో చావడానికెందుకు వెళ్తారు? భోజనం చేసి సాయంత్రం చల్లబడ్డాక వెళ్లండి. శ్యామా వీళ్లందరికీ భోజనాలు పెట్టు'' అన్నారు. అందుచేత మేము ఆగి మాధవరావు దేశ్‌పాండే దగ్గర భోజనం చేశాము. కొద్దినిముషాలు పడుకొని లేచి మళ్లీ మసీదుకు వెళ్లాము. సాయిమహరాజ్ నిద్రపోతున్నట్లుగా పడుకొని కళ్లు మూసుకొని ఉన్నారు. కొద్దిసేపయ్యాక జనం గేటు దగ్గర లోకమాన్యునికి తాంబూలమిచ్చారు. మేము మళ్లీ మసీదుకు వచ్చాము. బాబా మాకు ఊదీనిచ్చి వెళ్లడానికి అనుమతినిచ్చారు. అందుచేత మేము కారులో బయలుదేరాము. [కపర్దే డైరీలో తిలక్ మహాశయుని రాక గురించి ఇంతే ఉంది. ఇందులో శ్యామా ఇంట్లో భోజనం పెట్టమన్నట్లుంది. ఈ విషయాలన్నీ గుర్తు చేసుకుంటూ ఉద్ధవేశ్ దేశ్‌పాండే (శ్యామా - అంటే మాధవరావు దేశ్‌పాండే కుమారుడు) - కొన్ని వివరాలు చెప్పారొకసారి. "ఆరోజు తిలక్‌జీ తక్కువ మాట్లాడారు. కానీ ఆయన ప్రభావం అక్కడి వారిపై చాలా ఉన్నది. ఆయన ఆ రోజు రొట్టెతో తినడానికి తయారుచేసిన పిట్లం (పిష్టమా?!) (ఉల్లిపాయ, శెనగపిండితో చేసే కూర) చాలా ఇష్టంగా తిన్నారు. ఆయన వెళ్లిపోయాక బాబా "ఇతను అనుకున్నది జరుగుతుంది - కానీ ఇతను చూడడు'' అని అన్నారు'' - అనువాదకురాలు]

# కపర్దే డైరీ గురించి మరికొంచెం

- వి.ఆర్. ఖేర్

ఆగస్టు 1985 నుండి మాన్యశ్రీ గణేష్ శ్రీకృష్ణ కపర్దేగారి డైరీలు సాయిలీల మాసపత్రికలో వరుసగా వచ్చాయి. ఈ డైరీలోనుండి కొన్ని భాగాలు మొదటిసారిగా 1924-25లలో సాయిలీలలో వచ్చాయి. కొన్ని భాగాలని ఎందుకన్నానంటే ఆనాటికి మొత్తం డైరీ వెలుగులోకి రాలేదు. షిరిడీ డైరీ సాయిలీలలో మొదటిసారి సీరియల్‌గా వచ్చేనాటికి స్వర్గీయ శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ కుడి భుజంగా ఉన్న జి.యస్.కపర్దే రాజకీయ కార్యక్రమాల నుండి రిటైరై భారతీయ జాతీయ కాంగ్రెస్‌ను, సామాన్యులను కూడా మంత్రముగ్ధులను చేసిన

మహాత్మాగాంధీ రాజకీయాకాశంలోకి ఎదిగిపోవడంతో కపర్దే యీ పనిచేశారు. కపర్దేకు ఆధ్యాత్మిక ఉపదేశకుడైన సాయిసద్గురువు కూడా గతించారు. కపర్దే రిటైర్మెంట్‌కు అటూఇటూగా ఉన్నారు. ఆయనకి తన జీవితాన్ని వెనక్కి తిరిగి చూచుకోవడానికీ, హడావుడి రాజకీయ జీవితంలో నాయకుడిగాను, కార్యశీలిగాను ఉండిపోయి, తాను అందుకోలేకపోయిన తన స్వీయ ఆసక్తుల గురించి తీరికగా ఆలోచించడానికీ సమయం దొరికింది. అందుచేత ఆయన అనుమతితో షిరిడీ డైరీ సాయిలీలలో 24-25లలో ప్రచురితమయింది. అయితే పాఠకులు దేన్ని ఆధారం చేసుకొని నేనిలా చెబుతున్నానని అడగవచ్చు. నేను ఈ ప్రశ్నకి నాకు దొరికిన నా దగ్గరున్న సమాచారాన్ని ఇవ్వగలను.

అదృష్టవశాత్తు బాలకృష్ణ ఎలియాస్ బాబాసాహెబ్ కపర్దే అంటే జి.ఎస్. కపర్దే పెద్ద కొడుకు తన తండ్రి గారి జీవిత చరిత్ర వ్రాశాడు. అది మరాఠీలో వ్రాసి 1962లో ప్రకటించారు. దాని తొలిమాటలో రచయిత నిష్కపటంగా వ్రాశారు. "ఈ పుస్తకం నిజానికి జీవితచరిత్ర కాదు. దాదాసాహెబ్ కపర్దేగారి డైరీలో ఉన్న విషయాలను పోగు చేసి వ్రాసినదే".

ఈ జీవితచరిత్ర కథానాయకుడు 1854 ఆగస్టులో వినాయకచవితినాడు పుట్టడం చేత ఆయనకు గణేష్ అని పేరు పెట్టారు. మనం గణేష్ బాల్య చరిత్రను పైపైన స్పృశింపగలం. ఆయన తండ్రి శ్రీకృష్ణ నరహర్ ఎలియాస్ - బాపూ సాహెబ్ తన బాల్యంలో చాలా పేదరికాన్ని అనుభవించారు. కానీ సాహసంతోను, తీవ్రమైన కృషితోనూ తహశీల్దార్‌గా (మామల్దార్) (బీరార్ ప్రాంతపు బ్రిటిష్ రాజ్యంలో) పెరగగలిగారు. గణేష్ ప్రాథమిక, మాధ్యమిక విద్యలన్నీ నాగపూర్‌లోను, అమరావతిలోను జరిగాయి. అతను మెట్రిక్యులేషన్ రెండుసార్లు తప్పారు కాని తన క్లాసు పుస్తకాల కంటే అనేక మిగతా విషయాలపైన ఆసక్తి ఎక్కువ. దాంతోపాటు లెక్కల్లో బలహీనుడు. 1872లో మెట్రిక్ పాసయ్యాక ఆయన బొంబాయిలోని ఎల్ఫిన్‌స్టన్ కాలేజ్‌లో చేరారు. అక్కడి సంస్కృత ప్రాచార్యులు డాక్టర్ రామకృష్ణ భండార్కర్‌గారికి అభిమాన శిష్యుడయ్యాడు. గణేష్ చిన్ననాటనే సాంప్రదాయిక విధానంలో ఒక పండితుని దగ్గర అకోలాలో





సంస్కృతం అభ్యసించాడు. అందుచేత అతనికి ఆ విషయంలో అద్భుతమైన పునాది ఉంది. పైగా ఆయన సంస్కృత సాహిత్యాన్ని విపరీతంగా చదివాడు. బాణుని కాదంబరి, భవభూతి ఉత్తర రామచరిత్ర, ఎల్ఫిన్‌స్టన్ కాలేజీలో చేరక ముందే చదివేశాడు. అందుచేత అతనికి కళాశాలలో చెప్పే సంస్కృతం పిల్లాటలాగా కనిపించింది. ఆయనకు ఆంగ్ల సాహిత్యమంటే కూడా చాలా ఇష్టం. ఈయనకు ఇంగ్లీషు చెప్పిన వర్డ్స్ వర్త్ అనే ఆయన సుప్రసిద్ధ ఆంగ్ల ప్రకృతి కవి విలియమ్ వర్డ్స్ వర్త్‌కి మనుమడు. ఈ ఇద్దరు ప్రాచార్యుల క్రింద రెండు భాషలలోను చక్కని విజ్ఞానాన్ని సంపాదించగలిగాడు కపర్దే. నిజానికి ఆయన సంస్కృత జ్ఞానం ఎంత గొప్పదంటే-ఆర్య సమాజ సంస్థాపకులు శ్రీ స్వామీ దయానంద సరస్వతిగారు ఎల్ఫిన్‌స్టన్ కాలేజ్‌కి వచ్చినప్పుడు ఆయనతో సంస్కృతంలో మాట్లాడటానికి గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. అతని అద్భుతమైన భాషాప్రదర్శనకు స్వామీజీ ఎంతగానో మెచ్చుకున్నారు.

దాదాసాహెబ్ చిన్నప్పుడంతా గణేష్‌గానే అందరికీ తెలుసు. తరువాత జీవితంలో ఎల్ఫిన్‌స్టన్ కాలేజిలో మొదట జూనియర్ ఫెలోగాను, తర్వాత సీనియర్ ఫెలోగాను సంస్కృతం, ఇంగ్లీషుల్లో బోధకులకు సహాయకులుగా పనిచేశారు. ఆయన స్వతహాగానే గొప్ప భాషావేత్త. గుజరాతీ మొదలైన భాషలన్నింట్లో చక్కని వాగ్ధాటి ఉండేది. తమ మాతృభాషలాగే మాట్లాడేవారు వాటిని. పట్టభద్రుడయ్యాక దాదాసాహెబ్ 1884లో 'లా' చేశారు. తరువాత త్వరగానే న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. కొద్దికాలం ఆ సర్వీసులో ఉండి 1885 నుంచి 1889 వరకు మున్సిఫ్‌గా పనిచేశారు. తరువాత మళ్ళీ బార్‌కి తిరిగి వచ్చి, మంచి లీడింగ్ లాయర్‌గా పేరుపొందారు. 1890 నుండి ఆయన ప్రజా జీవితంలోకి వచ్చి 1890లో రాష్ట్ర కౌన్సిల్‌కు అధ్యక్షులయ్యారు. 1897లో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు అమరావతిలో జరిగినప్పుడు ఆయన జాతీయ జీవనంలో ప్రముఖ వ్యక్తిగా భాసించి, స్వాగత సమితికి ఛైర్మన్ అయినాడు. అసలు దాదాసాహెబ్ తన దినచర్య పుస్తకాలు ఎప్పటినుంచి ప్రారంభించారో, అలాంటి డైరీలు ఎన్ని దొరుకుతాయో ఒకసారి వెనక్కి వెళ్ళి చూద్దాం.

**(సశేషం)**

# రాణిమాత భిక్షము

పూర్వము ఒకప్పుడు భారతదేశంలో గోపీచంద్ అను రాజు ఉండెను. అతడు ప్రాపంచిక సౌఖ్యాలతోను, పరిపాలనతోను విసుగుచెందెను. రాణి మాత సలహా ప్రకారంగా అతడు రాజ్యము వదలి గోరఖ్‌నాధ్ అను గురువు వద్దకు పోయి తనకాత్మజ్ఞానమునుపదేశింపుమని అతనిని ప్రార్థించెను. రాజ్యపాలకుడైనందున నిగర్వి కాజాలడని యెంచి గురువు గోరఖ్‌నాధ్ గోపీచంద్‌తో ఇట్లనెను.

"బిడ్డా! నేను చెప్పినట్లు చేయుము. సాధువువలె కాషాయ వస్త్రాలు ధరించుము. ఒక భిక్షాపాత్ర గైకొని నీ రాజ్యములోనే నీవు భిక్షువుగా తిరుగుము. నీ ప్రజల వద్దనే భిక్షము సంపాదించుకొనుము. వారిచ్చినది గైకొనుము".

గోపీచందుకు తన గురువుపై విశ్వాసము అధికము. గురువాజ్ఞ తు.చ. తప్పకుండా నిర్వహించెను. తమ ప్రభువే తమ ఇండ్లకు భిక్షగాడుగా వచ్చుట జూచి ప్రజలు అతనికి అనేకమునొసంగిరి. అతడు మొదట తన పట్టణ మంతయు తిరిగిన పిదప స్వంత భవనమునకు పోయెను. రాణులను కూడా భిక్షమడిగెను. తమ భర్త భిక్షాపాత్రయందు భిక్ష వేసిరి. గోపీచందు వాటన్నిటిని తన గురువుగారికప్పగించవలసిందిగా తన తోడి శిష్యులకు ఇచ్చెను. ఆ తర్వాత ఆ రాజసన్యాసి తన తల్లి సౌధమునకు భిక్షకు పోయెను. ఆమెయే తన కుమారుని రాజ్యము త్యజించమని ప్రేరేపించియుండెను. ఆమె వలననే అతడు సాధువయ్యెను. ఆమె మిక్కిలి తెలివిగలది. అందమైన మన శరీరములు కూడ నశించుననియు, ప్రాపంచిక వస్తువులు రాజ్యాదులును నశ్వరమైనవేననియు ఆమె తన కుమారునకు యింతకు మునుపే బోధించెను. ఈ ప్రపంచము మన కొసగుచున్న వస్తువులన్నియు నశ్వరములే అయినందున వాని నుండి తప్పకొనుటయే అతనికి





మంచిదనియు, ఒక పూర్వ గురువును జేరి పారిమార్థిక జీవితము నలవరచుకొని పరమార్థమును అభ్యసింపుమనియు ఆమె ముందే గోపీచందుకు బోధించియుండెను. గోపీచందు భిక్షకై తల్లి ఇల్లుజేరగా, ఆమెయే గడప వద్దకు వచ్చి అతనిని అభినందించెను. ఆమె కరుణతో ఇట్లనెను.

"చూడుము యోగీ! నీవు ప్రపంచమునే త్యజించియున్నావు. నేనో యింకను గృహస్థునే. నీకు బోధించుట నాకు తగని పని, కాని నేనిపుడొక పని చేయదలచాను. నాకు యిష్టమైనది నీకు దానమిచ్చుటయే ఆ పని. కావున నీకు నేను "మాట సలహా" అను దానము చేయుచున్నాను, స్వీకరింపుము.

**మొదటిది :** ఓ యోగీ! నీ రాత్రులన్నియును బలమైన కోటలో గడుపుము.

**రెండవది :** నీ పడకను అతి మెత్తగా అమర్చుకొనుము.

**మూడవది :** మహా రుచికరమైన పదార్థములనే తప్ప వేరే భుజింపకుము.

ఆ మాటలకు గోపీచందు మిక్కిలి తికమకపడెను. కొన్ని క్షణాలు ఆలోచించి తన తల్లితో ఇట్లనెను.


"అమ్మా! ఈ సలహాయే నీవు తప్ప యితరులెవరైనా యిచ్చియున్నచో ఆమె పిచ్చిదనియే తలచియుండెడివాడను. ఎందుకందువా? నాకు అడవులలో కోట్లెటు లభించును? నా పడక రాళ్ళురప్పలతో కూడిన నేల తప్ప తదితరమెట్లు కాగలదు? ఇక నా ఆహారము, సన్యాసిగా నేను పిడికెడు మెతుకులే గదా తినవలసినది. నాకు రుచికర పదార్థములెట్లు లభించును?".

అతని మాటలకు రాణిమాత నవ్వి ఇట్లన్నది. "నీవు నా మాటలకు సరియైన అర్థము గ్రహించలేదు. 'ఓ యోగీ! నీవు అందమైన యువకుడవు. నీ సత్సంగము వినుటకు నీ వద్దకు పురుషులే గాక అనేక రకములైన స్త్రీలు వత్తురు, కానీ, ఒక యువసాధువు ఒక యువ విధవ వంటివాడు.

ఆ ఇద్దరును కోటలందే నివసింపవలెను. నీ గురువే నీకు కోట. సదా వారి రక్షణలో ఉండుము. వారి ఆజ్ఞల అవధులు దాటకుము. వారి బోధనలు అనబడు నాలుగు గోడల మధ్యనే ఉండుము. వారినే ఆశ్రయముగను, సేదదీర్చుకొను స్థలముగను భావించుము. నా యీ సలహా అనుసరించినచో నీకెన్నడును హాని కలుగదు".

రాణి మాత తరువాత యిట్లన్నది "ఇక ఆహారము సంగతి-నీకు మిక్కిలి ఆకలిగా ఉన్నప్పడే తిన్నచో ప్రతిది రుచికరముగానే, రాజభోజనం వలె ఉండును". "ఇక మెత్తని పడక విషయమును గూర్చి యిపుడు వివరించెదను. రాత్రింబవళ్లు మేల్కొని అభ్యాసము చేయుము. నిద్ర ముంచుకు వచ్చినప్పడే పరుండుము. అంతకుముందు కాదు. అట్లు అలసినపుడే గట్టి నేల సైతం మెత్తని పరుపుగా నుండును. అనగా నిద్ర వచ్చినపుడు పడుకునే పడకయే చాలా మెత్తని పడక". తల్లి వివరమునకు గోపీచందు తృప్తిచెందెను.

# శుకవాణి



- మాతాజీ

శ్రీ మదాంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధంలో ఒక చిన్న పద్యం ఉన్నది. ఇది అజగరం (మహాశబ్దం) ప్రహ్లాదునికి చేసిన బోధలోనిది. ఆకృతికి చిన్నదైనా శక్తికి మాత్రం గొప్పదే. మిరియపు గింజకున్నంత ఘాటున్నది.

"మలమున క్రిమియును బడు క్రియ
నిలబడు నొడలాత్మ గాదు హేయంబనుచున్
తలతురు తద్జ్ఞులు పొగడుదు





రలసత నొడలాత్మయనుచు నజ్ఞులిలేశా!"

"మనం తల్లి గర్భంలో ఉన్నప్పడు రక్తమాలిన్యాలతో ఉన్న మావిలో పడి ఉంటాం. దాదాపు తొమ్మిది నెలలపాటు ఆ కంపులో బతికి బయట పడతాం. ఆదిలో తల్లి గర్భంలో ప్రార్థనా ముద్రలో ఉన్న శిశువు బయటకు రాగానే శఠవాయువు కమ్మి, మాయకులోనై క్రమక్రమంగా తన ప్రార్థన మరచి, తన స్వస్వరూపాన్ని మరచి దేహవే తానన్న స్థాయికి చేరుకుంటాడు". ఇది నీచస్థితి నుంచి వచ్చినది-అశుద్ధంలోని పురుగు వంటిది. ఇది తాను కాదు. కేవలం తనకు ఆధారభూతంగా ఉన్న తోలుబొమ్మ మాత్రమే" అని మరచిపోతారు. అదే సర్వమని పలురకాల అలంకరించి, పలు రుచులతో, భోగాలతో దానిని సంతృప్తిపరచడానికే కాలం వెచ్చిస్తారు. మరికొంతకాలం ఆ తనువుతో ముడిపడిన బంధుబలగం కోసం ఖర్చు చేస్తారు.

అయితే జ్ఞానులైన వారి పద్ధతి యిలా ఉండదు. ఈ శరీరం కేవలం ఒక తోలుబొమ్మ. తనకు (ఆత్మకు) ఆధారభూతమైన ఒక పరికరం మాత్రమే అని భావించి దానిని ఎంతవరకు గౌరవించాలో అంతవరకే గౌరవిస్తారు. ఒక రౌతు గుర్రాన్ని, నావికుడు నావను పదిలంగానే చూసుకుంటారు. ఎందుకంటే అవి తమ ప్రయాణానికి అవసరం గనుక. దిగిన తర్వాత రౌతు గుర్రాన్నిగానీ, నావికుడు నావనుగాని నెత్తిన పెట్టుకుని ఊరేగడు. కాని మూర్ఖుడు మాత్రం యీ తప్ప చేస్తాడు. శరీరానికి యివ్వవలసిన స్థాయికంటే ఎక్కువిచ్చి అసలైన ఆత్మవిషయంలో మాత్రం ఆదమరచి ఆ తనువు చేసే చంచల క్రియల ఫలితాలను తాను అనుభవిస్తూ చివరికి మానవజన్మ అనే మాణిక్యాల మూటను చెట్టుకున్న పళ్లు రాలగొట్టడానికి ఉపయోగిస్తున్న వ్యర్థులైపోతారు. సూటిగా, బలంగా యీ భావాన్ని మనకు అందిస్తుంది పై పద్యం.

# గురు వాణి-5

ప్రియ ఆత్మస్వరూపులారా,

మానవజన్మ ఎనుబది నాలుగు లక్షల జన్మల తరువాత ఆయా జన్మల సత్కర్మఫలాన్ని వెలపోసి సాధించుకొన్న జన్మ. ఇది మన చేతిలో ఉన్న అద్భుతనిధి, దివ్యవరం. దీనిని ఎంత ఆనందమయంగా, అద్భుతంగా నడుపుకోగలిగితే అంతగా తరిస్తాం. లేకపోతే కళ్లు మూసుకుని ఎంత దూరం నడవగలనో చూద్దామనుకొని దారిలో పడివున్న ధనపు మూటను చూడకుండా దాటిపోయిన దురదృష్టవంతునివలె భగవదనుగ్రహాన్ని తొలగదోచుకున్న వాళ్లమవుతాము. మనం పరమాత్మయే మనకు సంరక్షకుడని గ్రహించిన తరువాత కూడా ఆయనకు దగ్గర కాకుండా ఆపేది మన లోపలి అహంకారం. సత్యం తెలిసినప్పటికీ అది బుద్ధి గోచనమే కానీ అనుభవం లోనికి రానీయనిది యీ అహంకారం. మన తెలివి, జ్ఞానం, చదువు యివన్నీ కలిసి మనను అహంకారపు మాయగా కమ్మేస్తాయి. ఫలితం మళ్లీ మళ్లీ పతనమవుతూ ఉండడం. ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకుంటే యీ విశాల సృష్టిలో మమెంత అల్పులమో మనకే అర్థమవుతుంది.

మిణుగురులు చీకట్లో ఎగురుతూ మిలమిలలాడుతాయి. తమంత తెల్లగా కాంతి వెదజల్ల గలవి ఏవీ లేవని గర్వపడతాయి. కొంతసేపటికి చుక్కలు వచ్చాక వాటిని చూసి మరింత ఖంగు తింటాయి. అటుపైన చంద్రోదయం కాగానే మరింతగా సిగ్గుపడతాయి. చివరికి తెల్లవారి సూర్యుడు వస్తే యిక యీ మిణుగురుల కాంతికి ఉనికెక్కడిది? అదేమాదిరిగా మనను మనం యీ విశ్వంలోని ఘనులైన వారితో పోల్చి





చూసుకుంటే మనలోని అహం తగ్గుతుంటుంది. సాయినాధుల వారి స్తోత్రంలో "అహంభావ హీనం ప్రసన్నాత్మ భావం" అన్న మాటలున్నాయి. అహంభావం నశించగానే మన లోపల నిర్మలమైన ప్రసన్నత ఏర్పడుతుంది. ఆ ప్రసన్న చిత్తమే మనను నిత్యానందానికి, సచ్చిదానంద మూర్తి అయిన పరమాత్మునికి దగ్గర చేస్తుంది.

శిష్యుడు గురుసన్నిధానానికి వెళ్లేటప్పుడు సమిత్పాణి అయి (హోమానికి అవసరమైన కట్టెపుల్లలు తీసుకుని) వెళ్లాలని శాస్త్రం చెబుతుంది. హోమానికి సహకరించడానికే కాదు. తాను తన లోపలి అవగుణాలను, అహంకారాన్ని కట్టెల రూపంలో చేతపట్టుకు వెళ్లి గురువు ముందు ఉంచాలి. ఆయన వాటిని తన బోధ అనే జ్ఞానాగ్నిలోవేసి దగ్ధం చేస్తారు. అలా చేసి తను బ్రహ్మజ్ఞానానికి యోగ్యుడిగా మలచమని శిష్యుడు ప్రార్థిస్తున్నాడు. మనం కూడా మన సద్గురువు సాయినాధుల వారి దర్బారులో ప్రవేశించేటప్పడే మనలోపలి అహంకారాన్ని విశ్లేషించి తెలుసుకుని, దానిని పరిపూర్ణంగా వినష్టం చేసి సద్ధర్మమార్గంవైపు శాశ్వతత్వం వైపు నడపమని ప్రార్థించాలి. అప్పడే మనం స్వచ్ఛమైన స్ఫటికపు బొమ్మలమై స్వామి శక్తిని ప్రతిఫలింపజేసుకోగలుగుతాం. తథాఽస్తు!



# సాకోరీ మహర్షి

## ప్రథమాధ్యాయం

### కుటుంబం

సాకోరీ అన్నది అహ్మద్‌నగర్ జిల్లాలో ఒక చిన్న పల్లె. ఇరవై ఏళ్ల క్రితం (1948 నాటికి ఇరవై ఏళ్ల క్రితం) ఏ కొద్దిమందికో తప్ప తెలియదు దాని పేరు. అలాంటి కుగ్రామంలో ఒక ఋషి తన నివాసం ఏర్పరచుకొన్నాడు. 1917 నుండీ ఆయన కీర్తి పరిసరాలకు వ్యాపించసాగింది. ఇప్పుడు వేలాదిమంది ఆ తీర్థయాత్రకు తరలివస్తున్నారు. మొదట ఆయన స్మశానంలో ఒక చిన్న తాటాకు గుడిసెలో ఉండేవారు. అక్కడ సందర్శకులకు ఉండటానికి చోటు దొరికేది కాదు. ఆ భక్తుల ఉత్సాహాన్నీ, గాఢతనూ మెచ్చుకోవాలి - అతి తక్కువ కాలంలోనే ఒక రెండతస్థుల భవనం, హుందాగా ఉండే గేటు, దత్త స్వామికి గొప్ప దేవాలయం, రెండు విశాలమైన ధర్మశాలలు తదతర భవనాలు కూడా వెలిశాయి. అది స్మశానం అన్న మాట మారిపోయి ఓ చిన్నసైజు నగరమే వెలిసింది. ఆయన యీ గ్రామం బయట ప్రయాణాల్లో ఉంటే ఏమి జరుగుతుందో చూద్దాం. 1930లో ఆయన బొంబాయి వెళ్లినప్పుడు వాల్కేశ్వర్‌లో శేఠ్ గోవిందదాస్ ఇంట్లో విడిది చేసారు. ఆయన దర్శనానికి జనం గుంపులు గుంపులుగా వచ్చిపడ్డారు. ఒకరి తర్వాత ఒకరు ఓ ప్రవాహంలా పాదాలపై సాష్టాంగ పడటం, పువ్వులు సమర్పించి వెళ్లడం, వాళ్ళు చకచకా కదిలిపోతూనే ఉన్నారు. అది అలా మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలై రాత్రి తొమ్మిది వరకు కొనసాగింది. ఎక్కడా ఆగకుండా. ఇదంతా చూసాక సహజంగానే యీ సాధువెవరు? ఎక్కడినుండి వచ్చారు? ఏమిటి యీయన





గొప్పతనం? ఈ భక్తులకు యీయన వలన ఏమి లాభం కలిగింది- అనే సందేహాలు కలుగుతాయి.

కాశీనాథ్ గోవింద్ ఉపాసనీ శాస్త్రి (శ్రీ ఉపాసనీ బాబా మహారాజు) మహారాష్ట్రలో నిష్ఠాగరిష్ఠులు, జ్ఞానులు, నైతిక విలువలు కలవారు అయిన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అది పూజారి కుటుంబం. గ్రామీణులకు పురాణాలు, పవిత్రగాథలు చెప్పడం కూడా చేస్తుంటారు. నాసిక్ జిల్లాలోని సతానా వారి నివాసస్థలం కాశీనాథ్ జన్మించేటప్పటికి ఆ కుటుంబం చాలా పేదరికంలో ఉన్నది.

కాశీనాథ్ తన తాతగారు గోపాలశాస్త్రితో కలిసి సతానాలోనే తన 22వ ఏట వరకు ఉన్నారు. ఆయన తండ్రి గోవిందశాస్త్రి జీవనోపాధి కోసం సివిల్‌కోర్టులో కాపీయిస్టుగా ఉన్నాగానీ, జ్యోతిష్యశాస్త్రం, లెక్కలు, హస్త సాముద్రికం మొదలైన వాటిలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఆయన ధూలియాలో పనిచేసేవారు. గోపాలశాస్త్రి తన 69వ ఏట ఉద్ధవుని మీద గొప్ప భక్తిపద్యాలు రచించేవారు. కృష్ణుని మీద దివ్యప్రేమ, ఆరాధన ఉద్ధవుని సొంతం. ఆయన (గోపాలశాస్త్రి) యవ్వనంలో ఉన్నప్పుడు గొప్ప విద్వాంసుడు కూడా అని పేరు పొందారు.

బరోడా మహారాజువారు వారిని తన విద్వత్‌సభలో ఒక ముఖ్యమైన సలహాదారుగా వేసుకున్నారు. కానీ, యువరాజావారు గద్దెనెక్కాక సిద్ధాంతాలకు, ఋజుత్వానికి విలువ తగ్గిపోయింది. అధికారం, సంపాదన కంటే సిద్ధాంతానికే విలువిచ్చే శాస్త్రిగారు బరోడాలో రాజీనామా చేసి, భగవత్పరమైన తన సామాన్య జీవితం గడపడానికి మళ్ళీ పూజారిగా వచ్చేశాడు. అక్కడ ఆయన బ్రాహ్మణునికి ఉండవలసిన వేదాధ్యయనం, అధ్యాపనం (చదివించడం), యజనం, యాజనం (యజ్ఞం చేయిం

చడం), దానం, ప్రతిగ్రహం అనే ఆరు లక్షణాలను సక్రమంగా నిర్వహించుకుంటూ వచ్చాడు. ప్రతీరోజు కొద్దిమంది పేదలు అతిథులుగా వచ్చి ఆతిథ్యం పొంది వెళ్ళేవారు. ఎనిమిది, పదిమంది పిల్లలు వారి దగ్గర కూర్చొని వేదాలు, మంత్రాలు, సంప్రదాయాలు, సంస్కృత వ్యాకరణం, సాహిత్యం అభ్యసిస్తూ ఉండేవారు. గోపాలశాస్త్రిగారు వాళ్ళను తన సొంత మనవళ్ళతో సమానంగా చూసుకొనేవారు. ఈ విద్యార్థులు తమ గురువు నుంచి కేవలం పాఠాలేకాక చాలా గొప్ప విలువలు నేర్చుకున్నారు. ఆయనలో ప్రకాశించే ఉదారత్వం, నిష్పాక్షికత, మెత్తదనం, పరిశుద్ధత, క్షమ, సహనం, నిజాయితీ, సత్యం, శాస్త్రగ్రంథాల మీద, సంప్రదాయాల మీద పూర్తి విశ్వాసం. పెద్దల మాటల పట్ల విధేయత, సనాతన విషయాల పట్ల గాఢత. ఇవన్నీ అలవరచుకున్నారు.

శ్రీ ఉపాసనీ మహరాజ్ జీవితాన్ని పరిశీలించిన వారికెవరికైనా, తాతగారి నుండి వారు నేర్చుకున్న సిద్ధాంతాలు, ఆయన ఆలోచనలను, చర్యలను ఎలా ప్రభావితం చేసాయో తెలుస్తుంది. అవి ఆయన కుటుంబానికి, జాతికి, దేశానికి కూడా ఎంతో మేలు చేశాయి.

ఐదుగురు అన్నదమ్ములలో కాశీనాథ్ రెండవవాడు. అతని అన్న బాలకృష్ణశాస్త్రి. గొప్ప సంస్కృత పండితుడు. ఆయన బొంబాయి యూనివర్శిటీలోని ఆర్ట్స్ ఎం.ఎ. వారికి పరీక్షకుడిగా ఉండేవారు. ధార్మిక విషయాలలో ఆయనను మించినవారు లేరు. అనేకమంది భారతీయ రాజావార్లు వాళ్ళ రాజ్యాలలో వచ్చిన పేచీల గురించి వీరిని అడుగుతుండేవారు. యవ్వనం నుంచి కూడా ఆయనను మధుశాస్త్రి (తేనెశాస్త్రి) అని పిలుస్తుండేవారు. ప్రశాంతత చెదరగొట్టుకోకుండా ఉండేవారు. విజ్ఞానం సూచించే చిరునవ్వుతోను, మధురమైన వాక్కుతోను, మంచి హృదయంతోను ఉండటం చేత ఆ పేరు ఆయనకు సార్థకమైంది.

**(సశేషం)**





# జీవుడు - కర్తవ్యం

**- సాధక మౌనానంద**

జీవుడు ఒక వ్యక్తిగా, సంఘంలో ఒక భాగంగా రెండు విధాలుగా బ్రతుకుతున్నాడు. మొదటి సంఘం ఇల్లు. తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మ, నాన్నమ్మ, అక్కలు, చెల్లెండ్రు, అన్నలు, తమ్ముళ్లు, యితర బంధువులు. ఆ తర్వాత బయటి స్నేహితులు, గురువులు, తోటి విద్యార్థులు. ఇలా సంబంధం పెరుగుతూపోతూ ఉంటుంది. ఇతరుల వల్ల సుఖం పొందుతాం, దుఃఖం పొందుతాం. అలాగే మన వల్ల యితరులు ఎప్పటినుండో యిలాగే జరుగుతున్నది. మనకు తెలిసి దీనికి ముగింపు ఉండదు.

సృష్టిలోని చరాచరాలలో కూడా ఆత్మ వుంటుందని ప్రతి జీవిలోను, వస్తువులోను, చైతన్యం (ఆత్మ) వుందని తెలుస్తూ వుంది, కాని తాను తప్ప అన్యజీవాత్మలు వస్తువులు స్వీకరించబడుతున్నవి. కావున జీవికి అన్య పదార్థ సంబంధం వల్ల సుఖం, దుఃఖం కలుగుతుంది. అన్య పదార్థమే ప్రపంచం నీకు అతి దగ్గరగా ఉన్న అన్య పదార్థము నీ మనస్సు (సూక్ష్మము, కనిపించదు) తర్వాతనే నీ శరీరం, ఆపై యితర మనుష్యులు, జంతువులు, వస్తువులు మొదలైనవి. సంబంధం పెట్టుకొంటే సుఖం, దుఃఖం. దీనికే మనం బాగా అలవాటు పడ్డాం. అన్యపదార్థ సంబంధం లేక బ్రతకడం తెలియదు.

చిన్నప్పడు మనతో కలిసి వున్న స్నేహితులు యిపుడు లేరు. కావున వారి పట్ల మనకు సుఖంగాని, దుఃఖంగాని లేదు కాని వారి జ్ఞాపకాల వల్ల (స్వప్నంలాగా) కొంత మనసు కలత చెందవచ్చు అంతే. పాత స్నేహితులు, వస్తువులు, ప్రదేశాలు కనుమరుగువుతుంటే క్రొత్త స్నేహితులు, వస్తువులు, ప్రదేశాలు మనకు దగ్గర అవుతున్నారు. మనిషి మరణిస్తే తప్ప దీనికి ముగింపు ఉండదు. జన్మ సిద్ధాంతాన్ని నమ్మితే కొంతకాలం విరామం తర్వాత యిదే తంతు కొనసాగుతుంది. ఇది ప్రతి ఒక్కరి అనుభవం. ఇలా

బ్రతకడంలో బంధమున్నది, తద్వారా సుఖము, దుఃఖము కలుగుతున్నాయి. ఈ నిరంతర సుఖ దుఃఖాల నుండి ముక్తి పొందవచ్చు అని కొందరు చెపుతున్నారు. భక్తి ఒక్కటే చాలన్నారు కొందరు. కొందరు జ్ఞానం ప్రధానమన్నారు. కొందరు వైరాగ్యం ప్రధానమన్నారు. కొందరు ఒక్క దానిని పట్టుకొంటే మిగతా రెండు అవే మనల్ని చేరుతాయి అన్నారు. కాల గమనంలో అనేక సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. ఎవరి మానసిక స్థితిని బట్టి వారు ఒక సిద్ధాంతాన్ని పట్టుకొని జీవితం సాగిస్తారు. అప్పడప్పడు సిద్ధాంతాలను మార్చుకొంటారు. ఏది ఏమైనా అందరూ ముక్తిని కోరుకొంటారు.

ఏ సమస్య నుండి అయినా విడుదల కావడమే ముక్తి. ఆకలి వేస్తే, అన్నం తింటే ఆకలిపోతుంది. అదే ముక్తి. నిరుద్యోగికి ఉద్యోగం వస్తే, నిరుద్యోగ సమస్య నుండి ముక్తి. అలాగే రోగం నుండి ముక్తి. వ్యవహార జీవితంలో యిలాంటివి కోకొల్లలు. నిత్యం జరుగుతూనే వుంటుంది. నిద్ర గొప్ప ముక్తి మార్గం (సుషుప్తి) కాని యివన్నీ తాత్కాలికం, మరలా ఉత్పన్నం కావచ్చు. దీనికి కారణం అజ్ఞానం, మాయ, అన్యగ్రహణం, అనాత్మభావం అని చెప్పారు. (అన్నీ ఒక్కటే). దీని పరిష్కారమేమిటి? అంటే మూలాన్ని అంటే పరమాత్మ తత్వాన్ని, అధిష్ఠానాన్ని పట్టుకొమ్మన్నారు. అదే గ్రహణం. ప్రహ్లాదుడు 'చదవవలసిన మర్మములన్నింటిని చదివాను' అంటారు. మనం చూస్తున్నదంతా పరమాత్మ విభూతి మాత్రమే, లీలయే- అది అనిత్యం. అనిత్యాన్ని నిత్యమనుకోవడమే అవిద్య. అన్యథా గ్రహణం. త్రాడును పాముగా భావించడం. ఈ చిరకాల అలవాటును, గుర్తించడం తగ్గించడం, పూర్తిగా మానుకోవడం చేయాలి. త్రాడును గుర్తించటం అంతే అధిష్ఠానాన్ని అంటే ఉన్నదంతా పరమాత్మే అని తెలుసుకొని, దానిని మననం చేసుకొంటూ కాలం గడపాలి. అపుడు కొంత కాలానికి, (ఎప్పుడో చెప్పలేం.) అద్వైతభావం మన స్వభావమై, స్వస్వరూపస్థితిలో ఉండడం జరుగుతుంది అన్నారు పండితులు, జ్ఞానులు. నిర్ణయించి అనుసరించ వలసింది జీవుడే.





# వినండి నా మాట

**- ముప్పాళ్ళ దశవంతరావు**

1. భావి భారత పౌరులార
   సాయిధామపు చదువరులార
   జారిపోయిన కాలగురువుల
   సందేశం చవిచూస్తారా?
2. చదువుల తల్లి సరసన జేరిన
   బాలబాలికలు వినరండి
   ఆనందంబున మనరండీ
   ఆత్మానందం బొందండీ!
3. ఆత్మస్థైర్యముతో ముందుకు సాగిన
   అందరు తలలొగ్గే రండి!
   మిము చేరగ వత్తురు కనరండి
   తథ్యం బిది మది నమ్మండి!
4. ఓర్పున ఇతరుల కష్టసుఖంబుల
   పాలుపంచుకు చూడండి !
   విశ్వమే మీ ప్రేమ సంద్రమున తేలియాడు నండి!
   గురుశక్తి మిము వీడదెపుడు వీక్షించండి !
5. సంతసమున చిరువిషయములందున
   ఆనందము చవిచూడండి
   విశ్వమంత మీ చుట్టూ దిరుగుట
   ఓర్మితోడ గమనించండి ।
6. పుస్తక విషయము మస్తకమున గని
   ఆత్మానందము వెదకండి
   చెంతనున్న గురుదేవులగొల్చి
   జీవరహస్యము తెలియండి ।

# గురువుగారితో కబుర్లు

గురువుగారండీ, పాదాభివందనం.

మొన్నటి గురువారంనాడు మీరు మాతోనే ఉన్నారనడానికి రెండు గొప్ప నిదర్శనాలు దొరికాయి మాకు. మామూలుగానే ఆడపిల్లలంతా 'ఉష' హాల్లో పడుకున్నారు. బాగా వేడిగా ఉండటంతో కూలర్ వేసుకున్నారు. ఎప్పటిలాగే తూర్పుకు తలలుంచుకొని నిద్రపోయారు-తలుపులు వేసేసుకొని. తెల్లవారి ఏడు గంటలకు ప్రార్థనైపోయాక తల దువ్వుకొంటున్న మన ఆస్థాన గూఢచారి చైత్రకు సూట్‌కేసు వెనుక ఏదో కదులుతున్నట్లు కనిపించింది. అక్కలకు, అన్నలకు ఉప్పందించింది. కర్రలతో తయారై పోయారు. సూట్‌కేస్ ముందుకు లాగాం. పామే రెండు మూరల పొడవుంది-త్రాచుపిల్ల-సూట్‌కేస్ కవర్‌లోకి దూరింది. చిట్టి సూట్‌కేస్ బయటికి లాక్కుపోయాడు. పాము బయటికి వచ్చేసింది. ఎంత వెళ్లగొడదామన్నా, మళ్లీ లోపలికి వచ్చే ప్రయత్నమే చేస్తోంది. మొత్తం మీద ఎలాగో ఓలాగ దాన్ని పంపేసారు. అసలు ఆ పాము ఎన్ని రోజుల నుండీ అక్కడుందో, చిన్నపిల్లల అల్లరికీ, అరుపులకూ, గంతులకూ ఏమాత్రం సంచలించకుండా ఎలా ఉన్నదో-తనకు అంత దగ్గరగా పడుకున్న పిల్లలకు ఏ మాత్రం హానిచేయకుండా ఎలా ఉన్నదో-ఈ ప్రణాళికా రచయిత ఎవ్వరో మాకు అర్థం కాలేదుగానీ మాకై నిరంతర రక్షగా మా గురుశక్తి కాపున్నదన్న సంగతి మాత్రం అర్థమైంది. అది అలా అయిపోయిందా -

ఈ గురువారం వేకువన మీ (అన్నపూర్ణ) పాపాయికి పుత్రికోదయం జరిగింది. రక్తం బాగా తక్కువగా ఉన్నప్పటికీ-ఎటువంటి యిబ్బందీ లేకుండా పాప పుట్టింది. మేమంతా ఆ ఆనందాన్ని పంచుకొనేందుకు లేని మిమ్మల్ని తలుచుకొని, మేమే స్వీటు తినేసి, హాయిగా నిద్రపోయామా? నిన్నటినుంచీ కురుస్తున్న వాన బాగా పెరిగింది-ఉరుములు, మెరుపులతో తెల్లవార్లూ కురిసింది. తెల్లవారుజామున నాలుగున్నర ప్రాంతాల పే....ద్ద పిడుగు పడింది-అతి దగ్గరలో. ఒక్కసారి అందరూ అదిరిపడ్డాము. ఉ





దయాన్నే కృష్ణమూర్తిగారు వచ్చి 'నేను లేచి కాస్సేపయ్యాక ధ్యానం చేసుకో సాగాను. కొంతసేపటికి ఏదో పెద్ద శబ్దం వినపడి కళ్లు తెరిచాను. సన్నని వెలుగుతీగ లోనికి వచ్చినట్లు కనపడింది. కరెంట్ మీటర్‌కున్న ఇండికేటర్ ఎగిరి పైనున్న ఫేన్‌కు తగిలి, వచ్చి నా చేతికి తగిలి పక్కమీద పడింది. ఏదో ఒక పెద్దకాంతి అలా వచ్చిపోయినట్లనిపించింది. వెంటనే వైర్లు కాలిపోయిన వాసన వచ్చింది" అని చెప్పారు. భయంతో కాళ్లు చేతులు చల్లబడిపోయాయన్నాడు. తరువాత తొమ్మిదింటికి రాము ప్రశాంతికి ఆ వైర్లు కాలిన వాసన ఎలా వచ్చిందో అన్వేషణ ప్రారంభించాడు.

అప్పుడో పెద్ద విచిత్రం బయటపడింది గురువుగారండీ! మన ప్రశాంతి వృద్ధాశ్రమంలో సరిగ్గా కృష్ణమూర్తిగారు (మేడ మీద) ఉన్న గదికి వెనుకగా-మీరు వాచ్‌మన్ కోసమని కట్టించారు గదా ఓ గది. అది ఖాళీగానే ఉంది-సరిగ్గా దాని మీద పడింది పిడుగు! రూఫ్‌ను చీల్చేసింది-గది లోపలున్న కరెంటు తీగలన్నీ ముక్కలు ముక్కలై మాడిపోయాయి. అది అలా ... బయటకు వచ్చి ప్రక్కనున్న మెట్ల రెయిలింగ్‌ను విరక్కొట్టి భూమిలోకి వెళ్లిపోయింది. అది ప్రయాణించి తాకిన ప్రతిచోటా నల్లగా మాడిపోయింది. ప్రశాంతిలోని మీటర్ బాక్స్ ఛిన్నాభిన్నమై క్రిందపడి పోయింది. వైర్లన్నీ మాడిపోయాయి. ఫ్యాన్లలో లోపలి వైండింగ్ వైరు మాడిపోయింది. మొత్తం బిల్డింగ్‌లో సరిగ్గా అది కృష్ణమూర్తి, మాధవరావు గారు, ఆనందం, చంద్రం అంతా తమతమ గదుల్లో ధ్యానం చేస్తూ ఉండే సమయం. గురువుగారూ, మాకు అర్థం కానిదొక్కటే. సాధారణంగా పిడుగన్నది ఏదో ఎత్తైన చోటులో పడి నిలువునా భూమిని తాకుతుందని విన్నాము. ఇలా ఆ గదిలోకీ, యీ గదిలోకీ యిలా ప్రయాణించడం ఏమిటి? కృష్ణమూర్తి గదిలోకి వెళ్లినది అతనికేమీ కీడు చెయ్యలేదు. తిన్నగా క్రిందకు పోలేదు. నిర్మానుష్యంగా వేరుగా వెనుక ఉన్న గదిలోంచీ మళ్లీ రెయిలింగ్‌దాకా ఎందుకు ప్రయాణించింది? ఏ ఒక్కరికీ యిబ్బంది లేకుండా ప్రశాంతి భవనానికి చేయి అడ్డం పెట్టిన ఆ అదృశ్య రక్షాహస్తం ఎవరిది?

అవన్నీ అర్థం కానక్కర్లేదు మాకందరికీ. ఒక్కటి మాత్రం తెలిసింది గురుదేవా! మా గురుశక్తి మమ్మల్ని సదా రక్షించుకొంటూనే ఉన్నది- ఉంటుంది. ఆ చల్లని కరుణామయ నేత్రాలు మాపై ప్రేమ వర్షిస్తూనే ఉంటాయి. ఏ విషాలూ, ఏ వైపరీత్యాలూ మమ్మల్ని తాకకుండా కాపాడుతూనే ఉంటాయి. అయితే ఒక్క విన్నపం స్వామీ! అదే కరుణ మా మనస్సులపై కూడా చిలకండి. మా చిత్తచాంచల్యాన్నీ, అహంకారాలనూ మాడ్చి వెయ్యండి. మా లోలోపల అల్లుకుపోయి, సత్యపదార్థం వైపు నడవనివ్వకుండా ఉన్న మా ఆలోచనల తీగల్ని సమూలంగా కాల్చి పారెయ్యండి- మమ్మల్ని పరిపూర్ణంగా మీ వాళ్లను చేసుకోండి గురువుగారూ! మర్చిపోకండి.

మీ, పిచ్చితల్లి

## మాతృసంస్థ కబుర్లు

మే నెల అంటేనే ఎండల భయం. వేడిగాలులు, వాతావరణం అంతా వేడి వేడి ... పిల్లలంతా మధ్యాహ్నం 4 గం.ల దాకా మాతాజీగారి దగ్గరే ఉండి వారు చెప్పే మంచి విషయాలు, శ్లోకాలు నేర్చుకుంటూ గడిపారు. మే 5న గురువారం చి॥ సాయిదత్త (పాపాయి), వాసులకు బుల్లి పాపాయి పుట్టింది. పాపాయి ఆశ్రమం ఆడపడుచు పుట్టే వేళకు మాతాజీ, డా॥ ఝాన్సీగారు, సాయిగీత హుజూర్‌నగర్ వెళ్లి వచ్చారు. హుజూర్‌నగర్ వాస్తవ్యులు శ్రీ పూర వెంకయ్య గారు, వారి శ్రీమతిగార్లు ఎంతో చక్కటి ఆతిథయం యిచ్చారు మాతాజీ బృందానికి. ఆ రోజు వారి పెళ్లిరోజు కావటం మరో విశేషం.

మే నెల 12న సాయినాథ క్షేత్రంలో (మైనేనివారి పాలెం, గుంటూరు జిల్లా)లోని సాయి దేవాలయ దశమ వార్షికోత్సవం. ఆ సందర్భంగా 10వ తేదీనే సాయిధామం పిల్లలు, పెద్దలు అందరూ తరలివెళ్లారు. మాతాజీగారి ఆరోగ్యం బాగోలేకపోయినా మాతాజీగారు కూడా వెళ్లారు. మూడు రోజులపాటు జ్వరంతో బాధపడుతూనే ఉన్నారు. 12న ఉదయం





సాయిబాబా విగ్రహానికి భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఫల నారికేళ, క్షీరాభిషేకాలు గావించారు. అనంతరం 10.30 గం.ల సహస్రనామాలతో లక్ష పుష్పార్చన జరిగింది. పూజకు కూర్చొనే భక్తులతో దేవాలయం నిండిపోయింది. పూజానంతరం మాతాజీ అనుగ్రహభాషణం చేసారు. గురుదేవుల కృప వలన యీ గ్రామంలో సాయి దేవాలయం ఆశ్రమం రావటం గురించి వివరిస్తూ, కుల మత భేదాలు లేకుండా అందరూ కలసినడవాలనీ, ఒకే ఆలోచనతో పనిచేయటం వల్ల దానికి ఎంతో శక్తి ఏర్పడుతుందనీ, సాయిబాబా అన్ని రూపాలలో తానే ఉన్నారనీ చెప్తూ ఆంబోతు కథ చెప్పారు. గురుదేవుల యొక్క సంకల్పం సమాజసేవ అని దానిని అందరూ పాటించి తరించాలని, దానికి మూలకేంద్రం ఆశ్రమం కావాలని గురుదేవుల ఆకాంక్ష అని పేర్కొన్నారు. గురుదేవులు మన పట్ల చూపించిన కరుణ, ప్రేమలను మన జీవితాలలో కూడా చూపించాలని వాటికి అడ్డుగా ఉన్న అరిషడ్వర్గాలు, అహంకార, మమకారాలను తొలగించుకోవాలని చెప్పారు. గురుదేవులకు ఆశ్రమ ప్రాంగణంలో చిన్న మంటపం గ్రామస్తులందరూ కలిసి నిర్మిస్తే, పుష్కరాల నాటికి గురుదేవుల పాలరాతి విగ్రహం ప్రతిష్ఠించుకుందామన్నారు.

అనంతరం మహాహారతి, అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. అన్నదానంలో జనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ నిర్వహణలో ధనం, ధాన్యం, వస్తువులు అందించిన సాయిభక్తులందరికీ శ్రీ సాయి, పూజ్య గురుదేవుల ఆశీస్సులు కలగాలని ఆశీర్వదించారు మాతాజీ.

కార్యక్రమ నిర్వహణలో అహోరాత్రులు శ్రమించిన చి॥ సాయి రమణను సన్మానించి ప్రత్యేక ఆశీస్సులు అందించారు మాతాజీ. 13 ఉదయం మాతాజీ సాయినాథ క్షేత్రం నుండి బయలుదేరి దారిలో సత్తెనపల్లి ఆశ్రమ సందర్శనం చేసి సాయిధామం చేరారు.

ఎప్పటిలాగే యీ 2015-'16 సంవత్సరంలో కూడా శ్రీ సాయి విద్యాధామం పదవ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించింది. విద్యార్థులందరికీ పాఠశాల హార్దికాభినందనలు తెలియజేస్తున్నది.